మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త



## ప్రభుత్వాసుపత్రిని ప్రారంభించిన మంత్రి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

**వర్గల్, అక్టోబరు 23(ప్రభాతవార్త):** మండల కేంద్రంలో రూ. 1.56 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని మంత్రి వివేక్ వెంకటస్వామి బుధవారం రాత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి, జిల్లా వైద్యాధికారి ధనరాజ్, ఆర్డీవో చంద్రకళ, పంచాయతీరాజ్ ఎస్ఈ నరేందర్‌రెడ్డి, ఈఈ చిరంజీవిచారి, డీఈ రవీందర్, తహసీల్దార్ రఘువీరారెడ్డి, ఎంపిడివో మచ్చేందర్, వంటి మామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, మాజీ ఎంపిపి మోహన్, నేతలు నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**పుల్‌కల్, అక్టోబరు 23, (ప్రభాతవార్త):** హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు పడిన సంఘటన ఇసోజిపేట గ్రామంలో జరిగింది. ఎస్‌పి పరితోష్ పంకజ్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పుల్‌కల్ మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామానికి చెందిన దుదేకుల యాకూబ్ (45), దుదేకుల షహీద్ బేగం (37)లు మండలంలో 2019లో జరిగిన ఒ హత్య కేసులో యాకూబ్, షహీద్ బేగంలు నిందితులన్నారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన 2వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పిపి కృష్ణఅర్జున్ నిందితులిద్దరికి జీవిత ఖైదు శిక్షతో పాటు 3వేల రూపాయల చొప్పున జరిమాన విధిస్తు తీర్పు చెప్పారన్నారు. జరిమాన చెల్లించకుంటే మరో 6 నెలల పాటు సాదా కారాగార శిక్షను విధించాలని న్యాయమూర్తి తీర్పు వెలువరించారన్నారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి విజయశంకర్‌రెడ్డి, ప్రసాద్‌రావు, ఎస్ఐ పుల్‌కల్, సిఐ ఎన్ తిరుపతిరాజు,అధికారులు బి శ్రీనివాస్, కోర్టు లైజన్ అధికారి జి రాఘవేంద్ర, జిల్లా లైజన్ అధికారి కె సత్యనారాయణలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

## రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ అక్టోబరు 23, ప్రభాతవార్త :** విజిలెన్స్ బలోపేతం, ఆధారాలు సేకరణపై దృష్టి సారించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో రేషన్‌బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై పౌరసరఫరాల శాఖ నమోదు చేసిన 6ఏ కేసుల పురోగతిపై పౌర సరఫరాల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ, పోలీస్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్‌ఓ), డీఎం సివిల్ సప్లై, పోలీసు అధికారులు, ఏసీటీఓ, సాంకేతిక సహాయకులు, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేసుల పరిశీలనలో వేగం తీసుకురావాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నవారిపై పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేసారు. బియ్యం అక్రమ రవాణా వాహనాలను పట్టుకున్నప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా వీడియో, ఫోటో ఆధారాలను సేకరించి, 6ఏ నివేదికకు జతపరిచి సమర్పించాలన్నారు .సాంకేతిక సహాయకులు నమూనాలను వాహనం నంబరు, స్వాధీనం తేదీతో ప్రత్యేక బ్యాగులో భద్రపరచాలి. విశ్లేషణ ప్రక్రియను ఫోటో, వీడియో కవరేజ్ చేయాలన్నారు, వాటిని నివేదికతో సమర్పించాలన్నారు. స్వాధీనం చేసుకున్న అక్రమ రవాణా బియ్యాన్ని 15 రోజులకు ఒకసారి పత్రికలలో ప్రకటన ఇచ్చి, బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని సూచించారు. కోర్టులలో ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించేందుకు, డీసీఎస్‌ఓ ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమావేశమై సమన్వయంతో ముందుకు సాగాలి. ప్రభుత్వ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉత్తర్వులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మరియు నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్( రెవిన్యూ ) మాధురి , డి ఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, కమర్షియల్ టాక్స్ అధికారులు పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 23**



పట్టణంలోని కొత్తచెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన చెరువులైన మల్లె చెరువు, పాండచెరువు, కొత్త చెరువులను గురువారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ స్థానిక తహసీల్దార్ రజనికుమారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టిఎల్), బఫర్ జోన్ పరిధిలో జరుగుతున్న ఆక్రమణలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు సంబంధిత రెవెన్యూ, మునిసిపల్ శాఖలతో సమన్వయం చేసుకొని, చెరువుల అసలు సరిహద్దులను గుర్తించడానికి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. చెరువుల పరిరక్షణ, వర్షాకాలంలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ సమతుల్యత కాపాడడం ప్రధాన లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలు కూడా సరస్సుల పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వ ఆదేశాలను గౌరవించి ఆక్రమణలు లేకుండా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌస్ తోపాటు పలురువు అధికారులు ఉన్నారు.

### రైతులకు ఇబ్బందులు లేకుండా

## ధాన్యం కొనుగోలు చేయాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి

**చేర్యాల, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మార్కెట్ యార్డుల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులకు ఆదేశించారు. గురువారం చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సెంటర్‌లో పాడి క్లీనర్, తేమ శాతం కొలతల యంత్రాలు, కాంటాలు,టార్పలిన్ కవర్లుతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు రైతులు మాట్లాడుతూ పది రోజులుగా సెంటర్‌లో ధాన్యం ఆరబోయగా తేమ శాతం వచ్చిన కొనుగోలు చేయడం లేదని కలెక్టర్‌కు తెలిపారు. తేమశాతం వచ్చిన ధాన్యాన్ని క్లినింగ్ చేయించి వెంటనే గన్నిలలో నింపి లోడ్ చేయించాలని సిబ్బంది,తహశీల్దారుకు కలెక్టర్ ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా అధికారులు,సిబ్బంది అందుబాటులో ఉండి పనులు చేయాలన్నారు. అలాగే మండల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించాలని తహశీల్దారుకు సూచించారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

# రోడ్ల నిర్మాణం, మరమ్మతుల్లో నిర్లక్ష్యం వద్దు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**జోగిపేట, అక్టోబర్ 23, ప్రభాతవార్త:** అందోలు నియోజకవర్గంలో కొత్తగా నిర్మాణంలో ఉన్న రోడ్లు, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులకు సూచించారు. సంగారెడ్డి, మెదక్‌జిల్లాల పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి తన నివాసంలో గురువవారం నియోజకవర్గంలోని రోడ్ల పరిస్థితిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మెదక్ జిల్లాలో విస్తరించి ఉన్న అందోలు నియోజవర్గంలోని పలు మండలాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు, కొత్తగా నిర్మిస్తున్న అంగన్‌వాడీ భవనాలు, పలుపాఠశాలల్లో నిర్మిస్తున్న టాయిలెట్ల గురించి ఆయన క్షుణ్ణంగా చర్చించారు. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే కనెక్టింగ్ రోడ్ల పనులు త్వరగా పూర్తిచేయాలని మంత్రి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్ అండ్ బి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో గార్లపల్లి-అజ్జమర్రి బ్రిడ్జి నిర్మాణం పనుల పురోగతిపై చర్చించారు. పనుల్లో నిర్లక్ష్యం వద్దని, సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షిస్తుండాలన్నారు. సమీక్షా సమావేశంలో పిఆర్ ఎస్ఇ జగదీశ్వర్, ఇఇ నర్సింలు, డిప్యూటీ ఇఇ ప్రభాకర్, క్రిష్ణ, ఆర్ అండ్ బి ఇఇ నర్సింలు, డిఇ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్ల పరిస్థితిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

# మంత్రి ప్రోగ్రాంలో విద్యుత్ అంతరాయం

### అధికారులపై మంత్రి అసహనం.. చీకట్లోనే కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల పంపిణీ

**గజ్వేల్, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి 7.30 గంటలకు ఐఓసి కార్యాలయంలో ఏర్పాటు చేయగా చెక్కులను పంపిణీ చేయడానికి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని ప్రసంగిస్తున్న సమయంలో సుమారు 15 నిమిషాలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. దీంతో మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్యక్రమంలో ఒక్కసారిగా కరెంటు పోవడంతో కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కుల లబ్ధిదారులు కాసేపు అయోమయానికి గురయ్యారు. కార్యాలయం అంతా చీకటిమయం కావడంతో ఫోన్‌ల టార్చ్‌లైట్‌లు పెట్టి లబ్ధిదారులకు మంత్రి చెక్కులను పంపిణీ చేశారు. విద్యుత్ అధికారులతో పాటు సంబంధిత రెవెన్యూ అధికారులపై మంత్రి వివేక్‌వెంకటస్వామి అసహనం వ్యక్తం చేశారు. మంత్రి ప్రసంగిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడం ఏమిటని, ఇదంతా అధికారులు చేస్తున్నపనేనని కాంగ్రెస్ నాయకులు మంత్రి వివేక్‌వెంకటస్వామి దృష్టికి తెచ్చారు. అనంతరం చెక్కులను పంపిణీచేసి వర్గల్ మండలంలో జరిగే కార్యక్రమానికి వెళ్లారు. వేదికపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో,తహసీల్దార్లు, వివిధశాఖల అధికారులు ఉన్నప్పటికీ విద్యుత్ అంతరాయం కలగడం కొసమెరుపు.



లబ్ధిదారురాలికి చీకట్లోనే చెక్కును అందజేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

## పచ్చి పులుసుపై ఆగ్రహించిన జిల్లా కలెక్టర్

### హెచ్‌ఎం, సిబ్బందిపై చర్యలకు అదేశం

**కొండపాక, అక్టోబరు 23, ప్రభాతవార్త :** విద్యార్థులకు పచ్చి పులుసు పెట్టవద్దని హెచ్చరించినా ఎందుకు పెడుతున్నరని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమవతి హచ్‌ఎంపై మండిపడ్డారు. గురువారం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె అకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట సిబ్బంది వచ్చిన రాకపోయిన సాకులు చెప్పకుండా కామన్ డైట్ పాటించాలని హెచ్‌ఎంను, వంట సిబ్బందిని హెచ్చరించారు. పుడ్ చెకింగ్ టీచర్ విద్యార్థుల హాజరు ప్రకారం, కొలతల ప్రకారం అహార పదార్థాలను వాడుతూ అహారం రుచిగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ పాటించడంలేదని, పచ్చి పులుసు పెడుతున్నరని వారిపై చర్యలు తీసుకొవాలని డిఈఓ శ్రీనివాస్ రెడ్డిని ఆమె ఫోన్‌లో అదేశించారు. విద్యార్థులకు చదువుతోపాటు, భోజనం సక్రమంగా అందించాలన్నారు.

#### ఆరోగ్య ఉప కేంద్రం సందర్శన

అదే గ్రామంలోని అరోగ్య ఉప కేంద్రాన్ని అమె అకస్మికంగా సందర్శించారు. ఉప కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను అరా తీశారు. ఎంఎల్‌హెచ్‌పి సంధ్య, ఎఎన్‌ఎం స్వరూప రాణి విధులకు హాజరుకాకపోవడంపై అమె అగ్రహం వ్యక్తం చేశారు. వారికి సంతకాల రిజిష్టర్‌లో అబ్సెంట్ వేసి ఈ రోజు వేతనంలో కొత విధించాలని డిఎంఅండ్‌హెచ్‌ఒను ఫోన్‌లో అదేశించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, రిజిష్టర్‌లు అన్ని రాసేలా చర్యలు తీసుకొవలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్, ఎఎన్‌ఎంలు, అశా వర్కర్‌లకు కేటాయించిన విదులను సక్రమంగా నిర్వహించాలని లేని యెడల కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని అమె హెచ్చరించారు.



దుద్దెడలో పాఠశాలలో మధ్యాహ్న బోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ హైమవతి

# పదవి ఒక్కటే వందకు పైగా దరఖాస్తులు

### కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష పదవి పగ్గాలు బిసిలకా...రెడ్డిలకా? ఆశావాహుల ముమ్మర ప్రయత్నాలు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని దక్కించుకోవడానికి సీనియర్ నాయకులుతోపాటు పలువురు పార్టీ శ్రేణులు జిల్లా పరిశీలకులకు దరఖాస్తులు చేసుకున్నారు. గతంలో ఎన్నాడూ లేని విధంగా ఈసారి డిసిసి అధ్యక్షుడి నియామకానికి ఎఐసిసి అధిష్టానం పరిశీలకును నియమించిన విషయం తెలిసిందే!. డిసిసి అధ్యక్ష పదవి నియామకానికి ఆశావాహులను నుంచి దరఖాస్తులను స్వీకరించడానికిక జిల్లా పరిశీలకురాలుగా జ్యోతిరౌతేలాతోపాటు మరోముగ్గురిని నియమించింది. ఈక్రమంలో పరిశీలకులు జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్, దుబ్బాక నియోజక వర్గాల వారీగా పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించి ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఒక్క డిసిసి అధ్యక్ష పదవికోసం జిల్లాలో వందకు పైగా ఆశావాహులు దరఖాస్తులు సమర్పించారు. అనంతరం డిసిసి అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావాహులను వేర్వేరుగా పిలిచి పరిశీలకులు వారి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈసారి ఎలాగైనా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకోవాలన్న పట్టుదలతో ఉన్న సీనియర్ నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సిద్దిపేట జిల్లాగా అవతరించినప్పటినుంచి నేటివరకు దశాబ్ధా కాలంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులుగా రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కొనసాగుతూ వస్తున్నారు. ఈసారి ఎలాగైనా జిల్లా అధ్యక్ష పదవి దక్కించుకోవాలన్న పట్టుదలతో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారితో పాటు బిసి నాయకులు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత పార్టీ అధికారం కోల్పోయిన నాటి నుంచి తిరిగి అధికారంలోకి వచ్చే వరకు పార్టీని నమ్ముకొని కష్టపడి పనిచేస్తూ వస్తున్నా సిద్దిపేట పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం, టిపిసిసి చేనేత విభాగంగా అధ్యక్షుడు, మాజీ ఎఎంసి చైర్మన్ గూడూరి శ్రీనివాస్ (ఎస్టీడి), ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, ఆర్టీఏ సభ్యులు, డిసిసి ఓబిసిసెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్యచంద్ర వర్మతో పాటు మరో సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, దళిత వర్గానికి చెందిన దాసరి రాజుతో పాటు దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలకు చెందిన డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అంక్షారెడ్డి, బస్వరాజ్ శంకర్, శ్రీకాంత్, గిరికొండల్‌రెడ్డిలు డిసిసి అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. ఈసారి ఎలాగైనా జిల్లా పార్టీ అధ్యక్ష పదవి పగ్గాలు దక్కించుకోవడానికి ఆశావాహులు తాము నమ్ముకున్న నేతల చుట్టూ ఇప్పటికే పలుమార్లు చక్కర్లు కొట్టినట్లు సమాచారం. కాగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండడంతో పార్టీ అధిష్టానం మాత్రం సమర్ధవంతమైన నాయకునికి పార్టీ పగ్గాలు అప్పగించాలన్న ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

పార్టీ అధిష్టానం ఈసారి జిల్లా అధ్యక్ష పగ్గాలు బిసిలకు అప్పగిస్తుందా లేక మళ్లీ రెడ్డి సామాజిక వర్గానికే కేటాయిస్తుందా అని ఆశావాహులు అత్రుతతో ఎదురు చూస్తున్నారు. పార్టీ అధికారంలో లేకున్నా పార్టీని నమ్ముకుని పార్టీ పటి ష్టతతో పాటు కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వస్తున్నా తమ కంటే తమకే డిసిసి అధ్యక్ష పదవి దక్కుతుందని ఆశావాహులు కలలుకంటున్నారు. త్వరలోనే అధ్యక్ష పదవి ప్రకటన రానుండడంతో ఎవరిని వరిస్తుందో వేచి చూద్దాం మరి.



దరిపల్లి చంద్రం



గూడూరి శ్రీనివాస్



పూజల హరికృష్ణ



ఎల్.సూర్యచంద్రవర్మ



తాడూరి శ్రీనివాస్‌గౌడ్



దాసరి రాజు



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న ఏపీఎం గౌరి శంకర్

## ఉత్తమ ఉద్యోగులకు అవార్డులు ప్రదానం

**నర్సాపూర్ రూరల్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** జిల్లాలో వివిధ శాఖల్లో అత్యుత్తమ ప్రతిభ కనభర్చిన ఉద్యోగులు గురువారం కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మిదుగా అవార్డు అందుకున్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి పోషణ మాసం సంబరాలలో భాగంగా వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఐకెపి సెర్ప్ నుండి ఏపిఎం మార్గం గౌరీశంకర్, చైల్డ్ ఫ్రెండ్లి పంచాయతీ విభాగంలో రెడ్డిపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో ఎల్లయ్య, అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి, డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ హేమ భార్గవి, జిల్లా స్థాయి అధికారులు, ఐసిడిఏ సూపర్వైజర్లు,అంగన్వాడి కార్యకర్తలు ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రి, బాలికల పాఠశాలను ఎమ్మెల్యే తనిఖీ

**మెదక్ టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు గురువారం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రి, బాలికల పాఠశాలను సందర్శించారు. ఆసుపత్రిలోని వైద్యులతో మాట్లాడుతూ, రోగులతో మర్యాదగా మాట్లాడి, వైద్యం అందించాలని సూచించారు. అదే విధంగా, బాలికల పాఠశాలలో ఉపాధ్యాయులను విద్యార్థులు మంచి మార్కులు సాధించి, ఉత్తమర్యాంకులు తెచ్చేలా బోధన చేయాలన్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలపై తరచూ ఆకస్మిక తనిఖీలు జరిపిస్తామని, అధికారులు,సిబ్బంది అలర్ట్‌గా ఉండాలి, ప్రజా సేవలో ఎటువంటి నిరక్ష ్యల్ల వహించవద్దని హెచ్చరించారు.

## చెరువులో పడి వృద్ధుడు మృతి

**వర్గల్, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన వర్గల్ మండలం సీతారాంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కథనం ప్రకారం... సీతారాంపల్లి గ్రామానికి చెందిన పిట్ల బిక్షపతి ఈనెల 21వ తేదీన ఉదయం పని నిమిత్తం వేరే ఊరికి వెళ్లగా అతని తండ్రి పిట్ల లక్ష్మినర్సయ్య(72) ఇంటివద్దే ఉన్నాడు. తిరిగి 22వ తేదీన సాయంత్రం బిక్షపతి ఇంటికి రాగా అతని తండ్రి లక్ష్మినర్సయ్య కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో శవమై కనిపించాడు. బహిర్భూమి కోసం చెరువు వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందవచ్చని మృతుడి కుమారుడు బిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం

**సదాశివపేట, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** బైకును లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు సిఐ డి.వెంకటేష్ తెలిపారు. సిఐ కథనం ప్రకారం...సదాశివపేటలో మెకానిక్‌గా పనిచేస్తున్న మహమ్మద్ పాషా(45), స్నేహితుడు ఎండి యూసుఫ్ తోపాటు సదాశివపేట్ నుండి జహీరాబాద్‌కు సొంత పనిపై మోటార్ సైకిల్(టిఎస్ 34 8722)పై వెళుతుండగా మార్గమధ్యలో ఎన్‌హెచ్65, పిఎస్‌ఎంఎల్ కాలనీ ముందర, పటేల్ వే బ్రిడ్జ్ సమీపానికి రాగానే అదే సమయంలో జహీరాబాద్‌వెళుతున్న లారీ(టిఎన్52ఎఈ6368) డ్రైవరు అజాగ్రత్తగా అతివేగంగా నడిపిస్తూ వెనుక నుండి మోటార్ సైకల్‌ను ఢీ కొట్టాడు. మోటార్ సైకల్ నడిపిస్తున మహమ్మద్ పాషా, వెనుకకూర్చున ఎం.డియూసుఫ్‌కు తీవ్ర గాయాలై మృతి చెందారు. మృతుడు మహమ్మద్ పాషా కొడుకు ముజాహిద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సిఐ వెంకటేష్ తెలిపారు.

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

**ములుగు, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** ఉరేసుకొని ఒక యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ములుగు మండలం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ బహిలంపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బహిలంపూర్ గ్రామానికి చెందిన వలియదాసరి సమ్మయ్యకు ఇద్దరు కుమారులు కాగా పెద్ద కుమారుడు శివకుమార్ ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ గ్రామంలో మరో చోట అద్దెకు ఉంటున్నాడు. చిన్న కుమారుడు వలియదాసరి గణేష్‌కుమార్(20) బైక్ మెకానిక్ కాగా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇంటిలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. గురువారం మధ్యాహ్నం గణేష్‌కుమార్ ఇంట్లోని బెడ్రూంలోకి వెళ్లి తలుపు వేసుకోగా తల్లి తలుపు తీయమని అడుగగా ఎంతకీ తీయకపోవడంతో అప్పుడే అక్కడికి చేరుకున్న పెద్ద కొడుకు శివ కుమార్, చుట్టుపక్కల వారు తలుపులను బలంగా పగులగొట్టి చూడగా గణేష్‌కుమార్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని కనిపించాడు. వెంటనే గణేష్‌కుమార్‌ను కిందకు దించి గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. గణేష్ కుమార్ జేబులో సూసైడ్ నోట్ ఉడడంతో అది చూడగా అందులో తన ఆరోగ్యం బాగోలేదని, అనారోగ్య కారణంగా ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన చావుకు ఎవరూ కారణం కాదని రాసిపెట్టినట్లు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ బియ్యం పట్టివేత

**మెదక్ టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మెదక్ మండలంలోని రాజ్‌పల్లి గ్రామానికి సరిహద్దులోని మాల్బారీ ఫార్మ్ హౌస్ లో అక్రమంగా నిల్వ చేయబడిన 22 పిడిఎస్ బియ్యం సంచులను టాస్క్ ఫోర్స్ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం సంచులను మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించి, తదుపరి చర్యల కోసం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా మెదక్ టాస్క్ ఫోర్స్ సీఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, రవాణా లేదా విక్రయాలపై ఎవరైనా పాల్పడితే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు ఎవరూ పాల్పడరాదని, ఇలాంటి ఘటనల గురించి ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని సూచించారు.



అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ రైస్ బియ్యం

## మౌలికవసతుల కల్పనకు కృషిచేస్తాం

-కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చౌదరి సుప్రభాత్‌రావు



కాలనీ వాస్తవ్యులను సన్మానిస్తున్న సుప్రభాతరావు

**రామాయంపేట, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సహకారంతో పట్టణంలో కెసిఆర్ కాలనీలో మౌలికవసతుల కల్పనకు కృషిచేయడం జరుగుతుందని. ఆదర్శ వంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని అధికార కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయ కుడు చౌదరి సుప్రభాత్‌రావు తెలిపారు. గురువారం కాలనీలో కొత్త కార్య వర్గం ఏర్పడిన సందర్బంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా కెసిఆర్ కాలనీ నూతన కార్యవర్గం ఎన్నికలునిర్వహించారు. అధ్యక్షుడిగా డిజి.శ్రీనివాసశర్మ, గౌరవ అధ్యక్షులుగా బాలమణి, ప్రధాన కార్యదర్శిగా దిడ్డి మల్లేశం, కోశాధికారిగా దేవుని శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా రుద్రోజీస్వామి, కుద్బోద్దిన్, నమండ్ల రమేష్, సంయుక్తకార్యదర్శులుగా సాదుల యాదగిరి, తుజాల శ్రీనివాస్ గౌడ్, చిర్ర సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారు లుగా బసన్నపల్లి మల్లేష్ యాదవ్, ఊడెం దేవరాజు, పటేరి రాము, కర్రే నరేందర్, కార్యవర్గ సభ్యులుగా తుడుం పెంటయ్య, బల్ల యాదగిరి, మెకొండ యాదగిరి, గూగుల రాజేష్ ఎన్నికయ్యారు. అదేవిధంగా యూత్ కమిటీలో దేవుని ప్రకాష్ అధ్యక్షుడిగా, అరుణ్, సాయిమణి, ఉన్న తేజ, దస్తగిరి, భానుచందర్ ఉపాధ్యక్షులుగా, సచిన్‌సాగర్ ప్రధానకార్యదర్శిగా, ఓంకార్ కోశాధికారిగా, రుతిక్, అఫ్రోజ్‌ఖాన్, అజయ్, సాయికృష్ణ, జి. రాహుల్ సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. మహిళాకమిటీలో బండి మంజుల అధ్యక్షురాలిగా, పుట్టి లక్ష్మి, కళావతి, కవిత ఉపాధ్యక్షు లుగా, పుట్టి యాదగిరి ప్రధాన కార్యదర్శిగా, దిడ్డి సబిత కోశాధికారిగా, మర్కు సునీత సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సమావేశంలో కాలనీప్రజలు, మహిళ లు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

-ఎమ్మెల్యే రోహిత్‌రావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 23, ప్రభాతవార్త:** రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. గురువారం మండల పరిధి కొర్విపల్లిలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చిన రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. తూకంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయన్నారు. ప్రభుత్వం వరికి మద్దతు ధరను గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం చివరి గింజవరకు కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, యాదవరావు, జీవన్, మనోజ్ కుమార్, పుల్లారావు, సిద్దిరాములు, రామచంద్రం తదితరులున్నారు.

## నవంబరు 2న కోకో అసోసియేషన్ ఎన్నికలు

**నర్సాపూర్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** ఉమ్మడి మెదక్ జిల్లా కోకో అసోసియేషన్ ఎన్నికలు వచ్చేనెల నవంబరు 2న నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ ఆఫీసర్ సాయిరాం తెలిపారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా కోకో అసోసియేషన్ ఎన్నికలు నర్సాపూర్‌లోని లయన్స్‌క్లబ్ స్నేహబంధు భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ నెల 25న ఈ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ వేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ ఎన్నికల నామినే షన్ వేయడానికి ఈనెల 26న చివరితేదీ అని తెలిపారు. ఈ ఎన్నికల్లో పాల్గొనే వివిధమండలాల అధ్యక్ష, కార్యదర్శుల జాబితాను తయారు చేశామని తెలిపారు. ఈజాబితా ప్రకారం కోకో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహి స్తున్నట్లు సాయిరాం తెలిపారు. మరిన్ని వివరాల కోసం 80082 51614 ఫోన్ నెంబర్‌కు కాల్‌చేసి సంప్రతించగలరని ఆయన తెలిపారు.

## మానేపల్లిలో గాలికుంటు టీకాల కార్యక్రమం

-పాల్గొన్న పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకటయ్య



రైతులకు మందులు పంపిణీచేస్తున్న డాక్టర్ వెంకటయ్య తదితరులు

**వెల్దుర్తి, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మండలంలోని మానేపల్లి గ్రామంలో గురువారం పాడి గేదెలకు కృత్రిమ గర్భధారణ, పాడిపశువులకు గాలికుంటుటీకాల కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈసందర్బంగా పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డా.వెంకటయ్య కార్యక్రమంలో పాల్గొని రైతులకు మందులను పంపిణీచేశారు. 45పాడి గేదెలు కృత్రిమగర్భధారణ చేయడంతోపాటు 350పాడిపశువులకు గాలి కుంటుటీకాలు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే పలుపశువులకు సాధా రణ చికిత్సలు నిర్వహించడం జరిగిందన్నారు.

## స్లో సైక్లింగ్ క్రీడాకార్యక్రమం నిర్వహించిన ఎస్సై

**వెల్దుర్తి, అక్టోబరు 23 ప్రభాతవార్త :** వెల్దుర్తి పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల స్మారకార్థం గురువారం జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో స్లో సైక్లింగ్ క్రీడాకార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా పోలీసుశాఖ విధులు, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్‌సిబ్బంది చేస్తున్న త్యాగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు అమరవీరులపట్ల గౌరవం, కృతజ్ఞతాభా వాన్ని పెంపొందించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని అధికారులు తెలి పారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై రాజు, పాఠశాల ప్రధానోపాధ్యా యులు సాంబయ్యతోపాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు తదితరులు

## జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురడం తథ్యం : సీతారాం ధూళిపాళ



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ నాయకులు

**నార్సింగి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో గులాబీ జెండా ఎగురడం తథ్యమని మణి కొండ మున్సిపల్ బిఆర్‌ఎస్ అధ్యక్షులు సీతా రాం ధూళిపాళ పేర్కొన్నారు. గురువారం జూబ్లీ హిల్స్ నియోజక వర్గంలోని షేక్‌పేట ప్రాంతంలో బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్బంగా సీతారాం ధూళిపాళ, ఉపేంద్రనాథ్‌రెడ్డిలు మాట్లా డుతూ ...ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికా రంలోకి వచ్చిన కాంగ్రెస్, రెండే ళ్లుగా అధికారంలో ఉంటున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చ కుండా చతికిల పడిందన్నారు. హైడ్రాపేరుతో పేదల గూళ్లు కూలుస్తు పెద్దలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపిం చారు. కేసీఆర్ పాలనలో హైదరాబాద్ అంటే ప్రపంచ స్థాయిలో ఓ బ్రాండ్‌గా ఉండేదని, ఇప్పుడా పేరంతా గంగలో కలిసిపోయిందన్నారు. అమెరికా, చైనా, సింగా పూర్ దేశాలకు చెందిన బడాబడా పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడం వలన వేగంగా అభివృద్ధి సాధ్యపడిందని, ఇప్పుడు హైడ్రాను తీసుకొచ్చి పెట్టుబడిదారులందరిని హడలెత్తించార న్నారు. రియల్ వ్యాపారం కుదేలై వేలాది మంది రోడ్డుపాలయ్యారని తెలి పారు. ఏ రంగం చూసినా కాంగ్రెస్ పాలనలో పాతాళాని కి పడిపోయిందని, ఇలాంటి సర్కారు కళ్లు తెరువాలంటే, ప్రజలకు మేలు చేయాలంటే జూబ్లీహిల్స్‌లో ఓడించి తీరాలని ఓటర్ల ను కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు అండె లక్ష్మణ్ రావ్, షేక్ ఆరీఫ్, సుమ, దేవిప్రియా, ప్రభు, జోనయతి, విఠల్, శ్రీనివాస్, వెంకటేష్, తిరుపతి, పరమేశ్వర్ పాల్గొన్నారు.

## 27 నుంచి జిల్లా, రెవిన్యూ, మండల, గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న సిరికొండ మధుసూధనాచారి

**సైఫాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై వత్తిడీ చేసి పార్లమెంట్‌లో బిల్లు అమోదింప జేసి 9వ షెడ్యూల్డ్‌లో చేర్పించాలని తెలంగాణ బిసి సంక్షే మ సంఘం డిమాండ్ చేసింది. ఇందుకోసం ప్రభుత్వంపై వత్తిడి పెంచేందుకు ఈ నెల 27వ తేదీ నుంచి నవంబరు 5 వరకు రాష్ట్ర వ్యాప్తం గా అన్ని జిల్లా, రెవిన్యూ, మండల, గ్రామ స్థాయి ల్లో రిలే నిరాహారదీక్షలు కొనసాగిస్తామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ హెచ్చరిం చారు. సంఘం ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 42 శాతం బిసి రిజర్వేషన్‌లపై విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎర్ర సత్యనారా యణ అధ్యక్షత వహించగా, రాష్ట్ర శాసన మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనా చారి, కాంగ్రెస్ సంవిధాన్ అధ్యక్షుడు డాక్టర్ వినయ్‌కుమార్, టిడిపి నాయకుడు పి.సాయిబాబు, దాస్‌రామ్‌నాయక్, మాస్ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు మాట్లాడారు. రాష్ట్రంలో జనగ ణనలో కులగణన జరిగి ఏడాది గడిచినప్పటికి బిసిలకు రిజర్వేషన్‌లు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్ లు సాధించేవరకు బిసిలందరిని ఒకేతాటిపైకి తీసుకువచ్చి ఐక్యంగా ఉద్యమిస్తామని వారు హెచ్చరించారు. అధి కార పార్టీ కుయుక్తులను తట్టుకోవడానికి ఇదే సరైన మార్గ మని, ఇందుకోసం అన్ని జిల్లాల బాధ్యులను ప్రకటించి ఉద్యమాన్ని తీవ్రతరంచేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలను, అన్ని కుల సంఘాలను, బల హీనవర్గాల సంఘాలను చేర్చుకుంటామన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన తరువాతే ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలకు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శ్రీనివాస్‌యాదవ్,కొసగి శ్రీనివాస్, వంశీ కృష్ణ, శారదగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్మనరీ హైపర్‌టెన్షన్ చికిత్సలో నిమ్స్ మరో మైలురాయి

**జూబ్లీహిల్స్, అక్టోబరు 23, ప్రభాతవార్తః** నిమ్స్‌లోని కార్డియాలజీ విభాగం అరుదైన వైద్య విజ యం సాధించింది. చెన్నైకి చెందిన 30 ఏళ్ల పాథల జిస్ట్ మహిళపై దేశంలో అత్యాధునికమైన పల్మనరీ ఆర్టరీ డెనర్వేషన్(పీఏడీఎన్) పద్ధతిని ఉపయోగిం చారు. రోగి ఐజెన్‌మెంగర్ సిండ్రోమ్ ఇ-పీడీఏ, తీవ్ర మైన సబ్‌సిస్టమిక్ పల్మనరీ హైపర్‌టెన్షన్‌తో బాధ పడుతూ నిమ్స్ ఆసుపత్రి లకి వచ్చారు. కాగా నిమ్స్ కార్డియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ ఎన్. రామకుమారి ఆధ్వర్యంలో, వైద్య బృందమైన డాక్టర్ నుషా దొడ్డి, డాక్టర్ ఉమాదేవి కరూ రు, డాక్టర్ అజయ కశ్యప్, డాక్టర్ మౌనిక మెల్లంపుట్టి, డాక్టర్ పి. వినయ్‌కుమార్, డాక్టర్ కె. భరత్‌రెడ్డి, డాక్టర్ నరేష్ నాయుడు, డాక్టర్ పి. చంద్రకాంత్ బృందం ఆమె కు చికిత్సను అందించారు. చికిత్స అనంతరం రోగి పల్మ నరీ ఆర్‌టరీ ప్రెషర్ 105ఎంఎంహెచ్‌జీ నుండి 88 ఎంఎంహెచ్‌జీకి తగ్గింది. ఈ విధానం గుండె మార్పిడికి ఒక 'బ్రిడ్జి టు ట్రాన్స్‌ప్లాంట్'గా ఉపయోగ పడుతుందన్నా రు. తద్వారా తీవ్రమైన పల్మనరీ హైటెన్షన్ ఉన్న రోగులకు కొత్త ఆశ కల్పిస్తుందన్నారు. పీఏడీఎన్ అనేది క్యాథెటర్ ఆధా రిత నూతన వైద్య పద్ధతని, సాధారణ ఔషధ చికిత్స లకు, తీవ్రమైన ప్లమనరీ హైపర్‌టెన్సన్ రోగులకు ఇది ఉపయోగపడుతుందని నిమ్స్ డైరక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో ఇది తొలి పీఏడీఎన్ శస్త్రచికిత్సని, దేశంలో ఆరో విజయ వంత మైన కేసని అన్నారు. ఇది ఇవటర్వెన్షనల్ కార్డియా లజీ రంగంలో నిమ్స్ సాధించిన విశిష్ట ముందడుగని అన్నారు. ఈ సందర్భంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని ఆయన అభినందించారు.



శస్త్రచికిత్స నిర్వహించిన నిమ్స్ కార్డియాలజీ వైద్యులు

### అండర్ 19 పోటీల్లో ఆర్యన్ యాదవ్‌కు గోల్డ్ మెడల్




గోల్డ్ మెడల్ సాధించిన ఆర్యన్ యాదవ్‌ను పలువురు అభినందిస్తున్న దృశ్యం

**చార్మినార్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** హైదరాబాద్ జిల్లా స్కూల్ ఫెడరేషన్ ఆఫ్ 69వ ఇంటర్ స్టేట్ ఛాంపియన్ షిఫ్ అండర్ 19 పోటీల్లో పాతబస్తీ గొల్లకిడికి జై భవానీ వ్యాయామ శాలకు చెందిన ఆర్యన్ యాదవ్ గోల్డ్ మెడల్ సాధించారు.కాగా 92 కేజీల పోటీలకు ఆర్యన్ యాదవ్ ఎంపికయ్యారు.ఈ సందర్బంగా గోల్డ్ మెడల్ సాధించిన గొల్లకిడికి జై భవానీ వ్యాయామశాలకు చెందిన ఆర్యన్ యాదవ్‌ను పలువురు అభినంధించారు.

## భాగ్యలక్ష్మీ అమ్మ వారి ఖజానా పంపిణీ



**చార్మినార్, అక్టోబరు 25 ప్రభాతవార్త :** దీపావళీ సందర్బంగా చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరంలో భక్తులకు అమ్మవారి ఖజానా పం పిణీచేస్తున్నారు. అమ్మ వారి నాణాలు కోసం పెద్దఎత్తున భక్తులు తరలి వస్తున్నారు కాగా గురువా రం చార్మినార్ నుంచి గుల్జారాహౌస్ ఫౌంటెన్ వరకు భక్తులు అమ్మ వారి సందర్శన కోసం క్యూలో నిల బడి ఉన్నారు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో అత్యంత వైభవంగా దీపావళీ మహా మహోత్సవాలు జరిగాయి. చార్మినార్‌పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## విశ్వశాంతికై ప్రపంచం భారత్‌వైపు

**సైఫాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** విద్యా ర్థులు ఉత్తమ లక్ష్యాలతో దేశం, సమాజం కోసం సేవ చేసే మహాభాగ్యంగా ప్రశాసనిక రంగంవైపు దృష్టి సారించాలని అఖిల భారత రాష్ట్రీయ శైక్షిక్ మహా సంఘ్ సంయోజకులు గుంతలక్ష్మణ్ చెప్పారు. గతంలో భారతదేశం విశ్వగురువుగా విలసిల్లేదని, నేడు ప్రపంచమంతా విశ్వశాంతికై భారతదేశం వైపు చూస్తున్నదని, ఆ కల సాకారం చేసే సత్తా యువతపైనే ఉన్నదని చెప్పారు. నారా యణగూడలోని బాబూ జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సివిల్స్ పరీక్షల సంసద్ధత విష యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డా.ఎం.విజయ్‌కుమార్ అధ్యక్షత వహిం చారు. లా ప్రొఫెసర్ గంగిరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం ద్వారా ఏకకాలంలో విద్యార్థులు రెండు-రెండు కోర్సులు చేయవచ్చునని, అకాడమిక్ చదువుతోపాటు నైపుణ్య వికాస కోర్సులు నేర్చు కోవచ్చునని చెప్పారు. దీనికి తారక శ్రీనివాసరావు ధృవ సంస్థ చక్కటీ వేదికలా ఉందన్నారు.

## ప్రచారంలో పిజెఆర్ కుమార్తె

**జూబ్లీహిల్స్, అక్టోబరు 23, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరుపున పీజేఆర్ కుమార్తె, ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్, టీపీ సీసీ కార్యదర్శి పి.విజయారెడ్డి గురువారం ప్రచా రం నిర్వహించారు. ఎర్రగడ్డ డివిజన్‌లోని ప్రేమ్ నగర్, ఆనంద్‌నగర్, ఛత్రపతి శివాజీ నగర్, ఓల్డ్ సుల్తాన్ నగర్, బంజారానగర్‌లో ఇంటింటికి తిరు గుతూ ప్రచారం నిర్వహించారు. నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్బంగా ఆమె కోరారు. ఆమెతోపాటు కాంగ్రెస్ నేతలు శివకుమార్, రఘునాయక్ పాల్గొన్నారు.

## 108 అంబులెన్స్‌లో బిడ్డ జననం

-క్షేమంగా తల్లీ బిడ్డ

**సిర్గాపూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** 108 అంబులెన్స్‌లో ఓ తల్లి బిడ్డకు జన్మనిచ్చిన సంఘటన మండల పరిధిలోని రూప్లాతండాలో చోటుచేసు కుంది. పురటి నొప్పులతో తల్లడిల్లుతున్న అరుణాబాయిని ఆసుపత్రికి తరలించేందుకు 108 వాహనానికి సమా చారం ఇవ్వడంతో తండాకు వాహనంచేరుకుని గర్భిణి అరుణాబాయిని ఆసుపత్రికి తరలిస్తున్న తరుణంలో మార్గమధ్యలో బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నారని 108 ఈఎంటి అరుణ్ తెలిపారు. మెరుగైన వైద్యం అందించేందుకు తల్లి, బిడ్డలను నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.



బిడ్డకు జన్మనిచ్చిన తల్లి

# గాంధీనగర్ డివిజన్ పిఅండ్‌టి పార్క్ సుందరీకరణ

- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



గాంధీనగర్ డివిజన్ పిఅండ్‌టి పార్క్ సుందరికరణ పనులను పర్యవేక్షిస్తున్న స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

**చిక్కడపల్లి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్ పి అండ్ టి పార్క్ సుందరికరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తు న్నట్లు స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ వివరించా రు. గురువారం గాంధీనగర్ డివిజన్ పి అండ్ టి పార్క్ సుం దరికరణ పనులను స్థానిక కాలనీ వాసులతో కలిసి పరిశీలిం చారు. సుందరికరణలో భాగంగా పి అండ్ టి ( సురభి)పార్క్ లో పనులను వేగవంతం చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ , బిజెపి డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్, నేతలు సాయి కుమార్,జ్ఞానేశ్వర్,అరియు స్థానికులు శ్రీనివాస్,రాజశ్రీ, సువర్ణ,రాజేశ్వర్ రావు,అఖిల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్ విభాగం చేపట్టి న పనుల్లో కాంపౌండ్ వాల్ రిపేర్లు,ఫెన్సింగ్,పెయింటింగ్, పార్క్ చుట్టూ మేష్ ఏర్పాటు వాకింగ్ కొరకు పాత్ వే పను లు పూర్తి చేయించడం జరిగిందన్నారు. త్వరలో, ఆహ్లాదక రమైన చక్కటి మొక్కలను ఏర్పాటు చేసి స్థానిక కాలనీ వాసు లకు ఉపయోగకరంగా అందుబాటులోకి చేస్తామని అన్నారు. వాటితో పాటు తమకు అందిన ఫిర్యాదు మేరకు పార్కు ప్రాంగణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తే వా రిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని, సంబంధిత పోలీసు శాఖను కోరడం జరిగిందని, ప్రతిరోజూ సాయంత్రం 7:30 గంటలకు పార్కు మూసివేయబడుతుందని,ఆతరువాత పార్క్ ప్రాంగణంలో ఏవైనా చట్టవ్యతిరేక కార్యక్రమాలు జరిగితే వెం టనే స్థానికులు డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అంద చేయాలని కార్పొరేటర్ కాలనీ వాసులకు సూచించారు. గత కొన్ని ఏళ్లుగా నిరుపయోగంగా పడి వున్న పార్కును,ఎ నాయ కులు, అధికారులు పట్టించుకోలేదని, కార్పొరేటర్ పావని విన య్ ప్రత్యేక దృష్టి వహించి చేపట్టిన చర్యలతో కాలనీకి ఒక పార్కు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు, కాలనీ వా సులు కార్పొరేటర్ గారికి కృతజ్ఞతలు తెలియచేసారు.

## తమిళనాడు తరహాలో బిసి ఉద్యమం బలోపేతం : తీగల ప్రదీప్ గౌడ్




ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ప్రదీప్‌గౌడ్ తదితరులు

**హైదరాబాద్,అక్టోబర్ 23, ప్రభాతవార్త:** బిసిలకు కేవలం స్థానికసంస్థలలల్లో 42 రిజర్వేషన్ కాకుండా అన్ని రంగాల్లో 50శాతానికి పైగా వాటా దక్కాలని అందుకు తమిళనాడు తరహా బిసి ఉద్యమాన్ని నిర్మించి బిసి ముఖ్య మంత్రి అయ్యే వరకు పోరాడుతామని మహాజన సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్ గౌడ్ అన్నారు.ఈ మేరకు గురువారం సోమాజిగూడా ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ...అన్ని రంగా లో బిసిలకు 50 రిజర్వేషన్ల సాధనే లక్ష్యం తమ పార్టీ పోరా టం చేస్తుందన్నారు.ఇంద్రసహాని కేసు లో 50 రిజర్వేషన్ల పరిమితి అనేది ఒక కుట్ర అని కోర్టు కేవలం సూచన మాత్రమే చేసిందని గుర్తు చేశారు.ꭓ తెలంగాణా హైకోర్టు లో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని కావాలనే స్టే వచ్చే విదంగా కుట్రలు చేశారన్నారు. ఎస్సీ వర్గీకరణ కు 7 గురు జడ్జి ల ధర్మాసం వేసి 2004 తీర్పును రివ్యూ చేసి మాదిగలకు న్యాయం చేసిన ట్టు 11 మంది జడ్జి ల ధర్మాసం వేసి 50 రిజర్వేషన్ల పరిమి తి పైనా సుప్రీంకోర్టు లో రివ్యూ జరగాలన్నారు.ꭓదేశం లోఏది చేయాలన్న కేంద్రం చేతిలోనే ఉందని.దీనిపై రాష్ట్ర బీజేపీ నాయకులకు , బీసీ ఎంపీ లకు నోరెత్తే ధైర్యం లేకే ఈ పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రంలో సామాజిక పరిస్థితి లను వివరించే ప్రయత్నం కూడా చేయలేని దద్దమ్మలుగా మిగిలిపో తారని విమర్శించారు. అఖిల పక్షాన్ని ఢిల్లీ కి తీసుకెళ్లి బీసీ ల ఆకాంక్షను చాటే ప్రయత్నం బీసీ ఎంపీలు , కేంద్ర మంత్రు లు చేయరా ? అని ప్రశ్నించారు. ఇదే అంశంలో తమిళనాడు ప్రభుత్వానికి సాధ్యమయ్యి మనకెందుకు కావడం లేదు అని పరిశీలిస్తే నాయకత్వ చిత్త శుద్ధి లోపం తప్ప మరేం కనిపిం చడం లేదన్నారు. ఈ సమావేశంలో మహాజన సేన జాతీయ కో ఆర్డినేటర్ షణ్ముఖ రావు, మహిళా కన్వీనర్ మంగమ్మ, యువ సేన నాయకులు సాదిరం ప్రశాంత్, అరుణ్, అనిల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కన్నడ నాట్యరంగ ఆధ్వర్యంలో “కస్తూరి కూచిపూడి“ నృత్య



నృత్య గురువులు కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహిచిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ప్రముఖ సాంస్కృతిక సంస్థ కన్నడ నాట్యరంగ ఆధ్వర్యంలో “కస్తూరి కూచిపూడి“ పేరిట ఒక ప్రత్యేక నృత్య కార్యక్ర మాన్ని 26 వ తేదీన ఆదివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుం దరయ్య సుందరయ్య కళా నిలయం లో నిర్వ హించనున్నట్లు సంస్థ అధ్యక్షులు ఎం. కృష్ణ మూర్తి, కార్యదర్శి డి. రామచంద్ర లు తెలియజేసారు. “కస్తూరి కూచిపూడి“ గోదా వరి కావేరీల సంగమం అని, బెంగళూరు, హైదరాబాద్ కు చెందిన నృత్య గురువులు ఒకే వేదికపైన నృత్య ప్రదర్శనలు ఇస్తారని వారు వివరించారు. ఈ కార్యక్రమములో ప్రముఖ కన్నడ కవి, ఖికర్ణాటక రాజ్యోత్సవ పురస్కార గ్రహీత ఎం. ఆర్. సత్యనారాయణ రచించిన “సీతా రాఘవ“ నృత్య రూప కాన్ని, బెంగుళూరుకు చెందిన నర్తకీమణి విదుషి రాజశ్రీ హుల్ల తన బృందం తో ప్రదర్శిస్తారని, అనంతరం హైదరాబాద్ నృ త్యకళాకారిణి, గురు మధుమతి కులకర్ణి “నూపురవాణి“ శిష్య కన ప్రముఖ కవులు పురందర దాసు, కనక దాసుల ఆధ్యా త్మిక కీర్తనలకు కూచిపూడి నృత్యం చేస్తారని వారు తెలిపారు.

## విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలు అవసరం : శైలా తల్లూరి



కార్యక్రమంలో పాల్గొన్న ప్యూర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు గ్లోబల్ సిఇఓ డాక్టర్ శైలా తల్లూరి, కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్

**చిక్కడపల్లి అక్టోబర్ 23 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలు వారిలో మరింత ఉతేజాన్ని కలిగి స్తాయని ప్యూర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు గ్లోబల్ సిఇఓ డాక్టర్ శైలా తల్లూరి అన్నారు. గురువారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ, ఆటోనమస్, లా ఎంబిఎ కళాశాల ఆధ్వర్యంలో “ప్యూర్ ఆర్గనైజేషన్“తో అవగాహన ఒప్పం దం పునరుద్ధరణ కార్యక్రమం కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజా వివేక్ సమక్షంలో జరిగింది. ఈ ఆవాహన ఒప్పందం వల్ల విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలు, గ్లోబల్ అవగాహన పెంపొందించే విధంగా రెండు సంస్థలు కలిసి పనిచేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం లో సిఇఓ ప్రొఫెసర్ లింబాద్రి , డైరెక్టర్లు వై. విష్ణు ప్రియా, యా దగిరి, లా ప్రిన్సిపల్ డాక్టర్ సృజన, డిగ్రీ, ఎంబిఏ కళాశాల ప్రి న్సిపల్స్ డాక్టర్ మట్ట శేఖర్, డా అంజన్ కుమార్ పాల్గొన్నారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



అమ్మవారిని దర్శించు కుంటున్న డిప్యూటీ మేయర్

**తార్నాక, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** కార్తీక మాసం సంద ర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి గురువారం చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశా రు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, స్థానికులు డిప్యూ టీ మేయర్‌ను ఘనంగా సత్కరించారు.

## ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొ.కుమార్ మొలుగరంకు శుభాకాంక్షలు తెలిపిన విద్యార్థి సంఘాల నాయకులు



ఛాన్సలర్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

**తార్నాక, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివ ర్సిటీ వైస్ ఛాన్సలర్ గా ప్రొఫెసర్ కుమార్ మొలుగరం వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించి దిగ్విజయంగా ఏడాదికా లం పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు విద్యార్థి సంఘా ల నాయకులు,స్కాలర్స్,విద్యార్థులు వారిని కలిసి పూలబొ కే లు,శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## బిగ్‌బాస్ షోని తక్షణమే రద్దు చేయాలి



బిగ్‌బాస్ షోలోని సన్నివేశాలను ప్రదర్శిస్తున్న రవీందర్‌రెడ్డి తదితరులు

**సైఫాబాద్, అక్టోబరు 23 ప్రభాతవార్త:** ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున ఆధ్వర్యంలో వస్తున్న బిగ్‌బాస్ షోలోని అనేక సన్నివేశాలు అసభ్యకరంగా ఉంటున్నాయని, దీంతో పిల్లలు, విదార్థులు చెడు మార్గాల్లోకి వెళ్ళె అవకాశం ఉందని, తక్షణమే ఈ షోను తెలుగు రాష్ట్రాలలో రద్దు చేయాలని పలు వురు సామాజిక కార్యకర్తలు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక కార్యకర్తలు రవీందర్‌రెడ్డి, కమ్మరి శ్రీనివాస్, సుకు మార్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ మన భారతదేశం సం స్కృతి, సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గొప్ప పేరు ఉందని, ఈ బిగ్‌బాస్ షోలో అనేక సన్నివేశాలు, వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆరోపించారు. ఇలాంటి షోల వల్ల యావత్ సమాజానికి చెడ్డ పేరు వస్తుం దని, తక్షణమే ఈ షోను నిలిపివేయాలన్నారు. ఈ షోపై డిబెట్‌కు తాము సిద్దంగా ఉన్నామన్నారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఆ షోపై రివ్యూ కమిటిని ఏర్పాటు చేయాలని ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో శ్రీనివాస్,బాల్‌రెడ్డి, శ్రీలన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌పై పెట్రోల్ పోసి హత్యాయత్నం

### ఘాతుకానికి పాల్పడ్డ స్నేహితుడు

**సరూర్‌నగర్, అక్టోబర్ 23 ప్రభాతవార్త:** ఓ ఆటో డ్రైవర్ మరో ఆటో డ్రైవర్‌పై పెట్రోల్ పోసి హత్యా యత్నానికి ఒడిగట్టాడు. ఈ దారుణ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన బాధితుడు ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఉదంతం బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే... శ్రీశైలం రహదారిలోని కొత్తపేట్ ఎర్రకుంట ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఫతే అలీ అతని స్నేహితుడు ఓల్డ్ సిటీకి చెంది జహంగీర్‌లు ఆటో డ్రైవర్లుగా పని చేస్తున్నారు. అయితే బుధవారం రాత్రి ఎర్రగుం ట ప్రాంతంలో మద్యం సేవించిన తర్వాత వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో అంతకు ముందే సీసాలో తెచ్చి పెట్టుకున్న పెట్రోల్‌ను జహంగీర్ అబ్దుల్ ఫతే అలీపై చల్లి నిప్పంటించి పరారయ్యాడు. అయితే మంటల బాధలకు తాళలేక కేకలు వేయడంతో స్పందించిన స్థానికులు మంటల నార్పి పోలీసులకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఘటనా స్థలానికి చేరుకున్న బాలాపూర్ పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసుకున్న పోలీసులు ఫతే అలీ నుండి వాంగ్మూలం తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

## మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 23, ప్రభాతవార్త** పట్టణంలోని మినీ స్టేడియంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా మేరా భారత్ సిద్ధిపేట, వాజపేయి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ క్లస్టర్ ఆఫ్ బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ హాజరై రన్నింగ్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో భారత్ ఫ్లబిక్ స్కూల్, మైనారిటీ స్కూల్ టీంలు ఫైనల్‌కు చేరాయి. వాలీబాల్ పోటీల్లో మోడల్ స్కూల్ రెండు టీంలు ఫైనల్‌కు చేరుకున్నాయి. రన్నింగ్ (100మీ)లో రిస్వంత్ మొదటి స్థానం, సిద్ధార్థ్ రెండవ స్థానం, హుస్సేన్ మూడవ స్థానంలో నిలిచారు. కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఫైనల్ మ్యాచ్ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజత్వల భవిష్యత్తు ఉందన్నారు. క్రీడల్లో యువతను ప్రోత్సహించేందుకు మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్, స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా మేరాభారత్ వారు ఇలాంటి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వాజ్‌పాయ్ యూత్ అసోసియేషన్ సభ్యులు, బిజెపి పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, ఉపాధ్యక్షుడు నాగార్జున్, ప్రధాన కార్యదర్శి రాజేందర్, బిజెపి నాయకులు వరియోగుల అనంతస్వామి, అక్కన్నపేట మండల కార్యదర్శి అనిల్‌నాయక్, యువ మోర్చా మండల అధ్యక్షుడు కుమారస్వామి, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడు రైనానాయక్,నాయకులు రాజేష్, గణేష్, పీఈటీలు, ఎంపైర్ జాల శ్రీనివాస్, ఠాకూర్ దిలీప్, మహేష్, మెస్సీ, విద్యార్థులు, క్రీడాకారులు ఉన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలి

**కొమురవెల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండల పరిధిలోని రసులాబాద్‌లో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మాజీ సర్పంచ్ పచ్చిమడ్ల స్వామిగౌడ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వహకులు, అధికారులు తగు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎల్లయ్య, శ్రీనివాస్, రాములు, సంతోష్, రాజు, హమాలీలు భాను, నర్సయ్య, శ్రీనివాస్, నర్సింలు, నాగరాజు, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

### డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య


మాట్లాడుతున్న డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య

**నంగునూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిఆర్‌డిఓ జయదేవ్ ఆర్య సూచించారు. మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో మార్కెటింగ్ కమిటీ మెంబర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలలో నీడా, కరెంటు, నీటి వసతి, లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించగానే వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా రైతులకు అవగాహన కల్పించి కొనుగోలు కేంద్రాలలోనే అమ్ముకునేటట్లు చూడాలన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2389, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2369 మద్దతు ధర అందిస్తుందన్నారు. దొడ్డు రకం ధాన్యానికి ఆకుపచ్చ సుతిలితో సన్న రకం ధాన్యానికి ఎర్ర సుతిలితో కట్లు వేయాలని కమిటీ మెంబర్లకు సూచించారు. లారీ మిల్లులో దిగుమతి అయిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ ఏ రోజు అదే రోజు పూర్తి చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, సీసీలు పంగ లింగం, శ్రీనివాస్, ప్రేమలత, మల్లేశం, కమిటీ సభ్యులు,విఓఎలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుని డిప్యూటేషన్ రద్దు చేయాలని ఆందోళన


మాట్లాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

**చేర్యాల, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండలంలోని పాత దొమ్మాట ప్రాథమిక పాఠశాలలో సరిపడ ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలను సందర్శించి వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో సుమారు 36 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరికి బోధించేందుకు గతంలో నలుగురు ఉపాధ్యాయులుండగా అందులో ఒకరు బదిలీపై వెళ్లారని ఉన్న ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒకరిని డిప్యూటేషన్‌పై వెళ్తుండటంతో ఒక ప్రధానోపాధ్యాయుడు, ఒకే ఉపాధ్యాయుడితో పాఠశాలను నడిపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బడిబాట కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని చెప్పి మూడు నెలలైతే ఈ విద్యా సంవత్సరం ముగుస్తున్న సమయంలో పాఠశాలలో సరిపడ ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తమ పిల్లలకు సరైన విద్య అందకుండా ఆగమయ్యే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఉపాధ్యాయుడి డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని వారు కోరారు.లేదంటే పాఠశాలకు తమ పిల్లలను పంపకుండా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

## స్వామివారి అన్న ప్రసాద వితరణకు విరాళం



దాతలకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు దాతలు ముందుకు వచ్చి గురువారం విరాళం అందజేశారు. మండలపరిధిలోని రాంసాగర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి ప్రవీణ్‌కుమార్ రెడ్డి వాణి, నంగునూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన ఒంటేరు రాజశేఖర్‌రెడ్డి స్వప్న దంపతులు స్వామివారి దేవాలయానికి ఒక లక్ష 10,016 చొప్పున వేర్వేరుగా ఇద్దరు దాతలు విరాళాలు చెల్లించి ఏఈవో చేతుల మీదుగా మహారాజ పోషకుల సభ్యత్వ రశీదు తీసుకున్నారు. దేవాలయ అర్చకులు దాతలకు స్వామి వారి ప్రసాదం,శేష వస్త్రాలు, స్వామి వారి చిత్ర పటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు శ్రీరాములు, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, చిన్న మల్లికార్జున్, అర్చకులు మటం జగదీశ్వర్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## కళాకారులను పట్టించుకోని ప్రభుత్వం

### ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు శేఖర్

**చిలిపిచెడ్, అక్టోబరు 23 ప్రభాతవార్త :** కళాకారులను ప్రభుత్వం ఏ మాత్రం పటించుకోవడం లేదని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బి. శేకర్ ఒక ప్రకటనలో అన్నారు. బుధవారం చిలిపిచేడ్ మండల్ కేంద్రంలో జరిగిన శివిలీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళకారులకు గుర్తింపు కార్డు, బస్ పాస్, 50 సంవత్సరాలు నిండిన కళకారులకు 5000 రూపాయల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిలిపిచెడ్ మండలంలో నూతన కమిటి ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా ప్రశాంత్, కార్యదర్శి గా దతు. ప్రజానాట్య మండలి కమిటీ సభ్యులుగా వెంకటేశం. నర్సింలు. కిరణ్.రాజు. పెంటయ్య. తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### -ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం గజ్వేల్‌లోని మార్కెట్‌యార్డులో మొక్కజొన్న, ధాన్యం కొనుగోలు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.2400, ధాన్యంకు రూ.2389 మద్దతు ధర అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే పత్తి క్వింటాల్‌కు రూ.8110 మద్దతు ధర అందిస్తుండగా పత్తిలో తేమ 8 శాతం లోపు ఉన్నప్పుడే మద్దతు ధర పొందవచ్చన్నారు. తేమ శాతం ఎక్కువ ఉంటే మద్దతు ధర తగ్గుతుందన్నారు. పత్తి సాగుచేసిన రైతులు సిసిఐ కొనుగోలు కేంనరదాల్లో పత్తిని అమ్మడానికి ముందుగా కపాస్ కిసాన్ మొబైల్ ఆప్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు సంబంధిత సేవలకై 18005995779 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కార్యదర్శి జాన్‌వెస్లీ, ఏడిఏ బాబునాయక్, పిఏసిఎస్ సిఈవో బాలయ్య, మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వైద్య సేవలందుకున్న 1155 మంది పోలీసులు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** పట్టణంలోని పిఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం జిల్లా పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు అందచేసిన వైద్య శిబిరాన్ని పోలీసులు సద్వినియోగం చేసుకున్నారు. జిల్లాలోని ఆయా పోలీసు ఠాణాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు, వారి కుటుంబ సభ్యులు 1155 మంది వైద్య సేవలను అందుకున్నారు. జిల్లా పోలీసుల సంక్షేమానికి ఇక ముందు సైతం వైద్య శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. రౌండ్ ద క్లాక్‌గా విధులు నిర్వహిస్తున్న పోలీసులు సమయానికి భోజనం చేయక, కంటి నిండ నిద్ర పోక, చలి, గాలి, వాన అని చూడకుండా ఎప్పుడు పడితే అప్పుడు సేవలు అందించాల్సి ఉంటుందంతో ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునే అవకాశం లేక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. వైద్య శిబిరంలో 40 సంవత్సరాల వయసు పైబడిన 1155 మంది వరకు వైద్య సేవలు అందుకున్నారన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు మాట్లాడుతూ నిరంతరం ప్రజల కొరకు శ్రమించే పోలీసులకు సేవలందించే అవకాశం తమకు దక్కడం ఆనందంగా ఉందని, అవసరమనుకుంటే మరిన్ని వైద్య క్యాంపులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రఘునందన్‌రావు, డిఎస్‌పి సత్తయ్య గౌడ్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంగారెడ్డి అధ్యక్షులు కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆనంద్, కోశాధికారి డాక్టర్ హరినాథ్, డాక్టర్ రాజుగౌడ్, డాక్టర్ శ్రీహరి, పోలీసు డాక్టర్ జ్యోతి, అంబేద్కర్ కళాశాల నర్సింగ్ విద్యార్థులు, జిల్లా పోలీసులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 18 గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు

**వెల్దుర్తి, అక్టోబర్ 23 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రంగోత్సవం సెలబ్రేషన్స్ ఆర్ట్ కాంపిటీషన్ ముంబైవారు గత నెల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆర్ట్ ది యంగ్‌లో 18 బంగారు పతకాలు కాంపిటీషన్‌లో గెలుపొందారు. అలాగే 10 వెండిపతకాలు సాధించారని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్రమ్‌రెడ్డి సాంబయ్య తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులతోపాటు వీరిని తీర్చిదిద్దిన అధ్యాపకురాలు జయసుధను ప్రధాన ఉపా ధ్యాయులు ఇతర ఉపాధ్యాయసిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటస్వామి, నరసింహారెడ్డి, రాములు, చార్లెస్, పద్మజ, శైలజ, నవనీత, అమూల్య, ఇతర ఉపాధ్యా యులు పాల్గొన్నారు.


3.18 గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయబృందం


కలెక్టరన నుంచి ప్రతిభ అవార్డు అందుకుంటున్న సరళకుమారి

## సరళకుమారికి ఉత్తమ ప్రతిభ అవార్డు

**నర్సాపూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జిల్లాస్థాయి బెస్ట్ సూపర్‌వైజర్‌గా రెడ్డిపల్లి సెక్టార్‌కు చెందిన సరళకుమారికి అవార్డు లభించింది. గురువారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి పోషణ మాస ఉత్సవం సందర్భంగా సరళకుమారి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట గ్రామంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, శ్రీలతలకు బెస్ట్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రతిభ అవార్డు పొంది కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమాభార్గవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**రెడ్డిపల్లికి చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు ....**

**నర్సాపూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో జిల్లాస్థాయి అవార్డు లభించింది. మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా రెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో లభించిన జిల్లా స్థాయి అవార్డును కలెక్టర్ రాహుల్‌రాజ్ నుంచి పంచాయతీ కార్యదర్శి రమేశ్ అందుకున్నారు. రెడ్డిపల్లి గ్రామ పంచాయతీకి చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో జిల్లా స్థాయి అవార్డు రావడం పట్ల మాజీ ఉప సర్పంచ్ అశోక్‌గౌడ్‌తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఐ చొరవతో రోడ్డు సమస్య పరిష్కారం

**హత్నూర, అక్టోబరు 23, ప్రభాతవార్త:**


ప్రధాన రహదారిపై గుంతలలో పూడిపిస్తున్న ఎస్సై శ్రీధర్‌రెడ్డి

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజా సమస్యలపై ఎస్సై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నారు. హత్నూర దౌల్తా బాద్ ప్రధాన రహదారిపై కల్వర్టు కృంగిపోయి ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఎస్సై శ్రీధర్‌రెడ్డి గురువారం సొంత నిధులతో డస్ట్, కంకరతో కూడిన మెటీరియల్‌అందులో వేసి రోడ్డును లెవల్ చేశారు. చాలా రోజుల నుంచి ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎస్ఐ శ్రీధర్ రెడ్డిని అభినందిస్తున్నారు. ఇప్పటికే ఈ గుంతలలో పడి పలువురు గాయాల పాలయ్యారు.

## పాఠశాలలో పాము కలకలం

**చిన్నశంకరంపేట, అక్టోబరు 23,ప్రభాతవార్త:** మండల పరిధిలోని గజగట్లపల్లిలో ప్రాథమిక పాఠశాలలో ఉన్న బాత్రూంల వద్ద నాగుపాము రావడంతో విద్యార్థులు బయాందోళనతో కేకలు వేశారు. ఇది గమనించిన ప్రధానోపాధ్యాయుడు గాలయ్య విద్యార్థులకు ప్రమాదం కలగకుండా పామును హతమర్చారు. దీంతో గ్రామస్థులు ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు.


గజగట్లపల్లిలోని పాఠశాలలో పామును తొలగిస్తున్న ప్రధానోపాధ్యాయులు

# నల్లచెరువును కాలుష్యం చేస్తున్న కంపెనీపై చర్యలు తీసుకోవాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

**గుమ్మడిదల అక్టోబరు 23 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు నల్లచెరువు కాలుష్యాన్ని కారణమైన హెట్రో డ్రగ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో దోమడుగు వార్డులో గొల్లపల్లి జయరాజు పర్యటించారు. పర్యటనలో నల్లచెరువును పరిశీలించి స్థానిక రైతులతో ఆయన మాట్లాడుతూ హెట్రో డ్రగ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెండు నెలలుగా రైతుల ఆందోళన చేస్తున్నా పీసీబీ అధికారులు కనీసం గ్రామాన్ని సందర్శించలేదని విమర్శించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఈఈని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. 4 గొలుసు కట్టు చెరువులు కింద 5400 ఎకరాలు భూములు నష్టం జరుగుతుందన్నారు. గ్రామంలో దుర్వాసన వస్తున్నా, బోర్లు పాడవుతున్న అధికారులు స్పందించటం లేదన్నారు.

రైతులు, ప్రజలు, వృతి దారులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు కృష్ణ, రైతులు బాల్‌రెడ్డి మంగయ్య, రాజు, స్వేచ్ఛ రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

## కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే నైతిక హక్కు బిఆర్ఎస్‌కు లేదు

### పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు

**సిద్దిపేట రూరల్, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ నాయకులు కానీవారిని బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకొని కాంగ్రెస్ పార్టీని బద్నాం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాయలంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 10 యేండ్లు అధికారంలో ఉండి అన్ని వర్గాలకు పంగనామాలు పెట్టిన బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రశ్నించే కనీస నైతిక హక్కు లేదన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం నిరుద్యోగ భృతి పేరిట నిరుద్యోగులను, దళిత బందు, బిసి బందు, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ పేరిట దళితులను, బిసిలను, డబుల్ రూం పేరిట గూడులేని నిరుపేదలను మోసం చేసిన ఘనత వారికే దక్కుతుందన్నారు. తులం బంగారంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు మహిళలను ఉసిగొల్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే వెనక్కి తగ్గదని ఇచ్చిన ప్రతి హామీని సిఎం రేవంత్‌రెడ్డి మరో మూడు యేండ్ల కాలంలో అమలు చేసి తీరుతారని తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపికి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ నాయకులు మధు, గయాజుద్దీన్,హర్షద్, నజ్జు, బాబ,ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్'పై అవగాహన

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 23, ప్రభాతవార్త :** సహస్ స్వచ్ఛంద సేవా సంస్థ సిజిఐ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయగిరి బిక్షపతి, వైస్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నైనాదేవి, సహ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఇటికాల చిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లా డుతూ ప్రపంచంలో భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా చెప్పుకుంటున్నాం కానీ, అన్ని సమస్యలతో పాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అనేది ప్రధాన సమస్యగా మారిందన్నారు. దీనిని నివారించడానికి ప్రభుత్వాలతోపాటు ఎన్‌జివోలు అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, దీనివల్ల ప్రజల్లో అవగాహన పెరిగి వారి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి దోహదం చేస్తుందని చెప్పారు. తడి చెత్త వల్ల బయోగ్యాస్, ఎరువులు ఏ విధంగా తయారు చేయవచ్చు అనే అంశాన్ని చర్చించారు. పొడిచెత్తను వివిధరకాలుగా రీసైకి లింగ్ ఏ విధంగా చేయాలో వివరించారు. అదే విధంగా ప్రమాదకరమైన చెత్తను సైంటిఫిక్ ల్యాండ్ ఫిల్ ఏ విధంగా చేయాలనే విషయాన్ని వివరిం చారు. ప్లాస్టిక్ బదులు స్టీల్ బ్యాంకులు వాడినట్లయితే ప్లాస్టిక్ నివారణ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు అధ్యాపక బృందం సాహస్ ఎన్జీవో ఫీల్డ్ సూపర్‌వైజర్లు బాలరాజ్, సంపత్, వినీత్, శ్రావనేష్ ఉన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**నంగునూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బద్దిపడగ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆద్య కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో విద్యార్థులతో పాటు గ్రామస్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి శస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని సిద్దిపేటలోని ఆద్య నేత్ర వైద్యశాలకు తరలించారు. ఈ సందర్భంగా హెచ్ఎం పులగూర్ల రాజేశ్వర్ రెడ్డి, కంటి వైద్య నిపుణుడు బాలకిషన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మాధవి, పాఠశాల బృందంగా తదితరులు పాల్గొన్నారు.

## వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

**చేర్యాల, అక్టోబరు 23, ప్రభాతవార్త :** కార్తిక మాసం ఆరంభం కావడంతో పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో అర్చకులు శేషాచార్యులు రాజు స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## నూతన వధువుకు ఆర్థిక సహాయం, పుస్తెలు, మెట్టెల అందజేత

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 23, ప్రభాతవార్త :** అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం క్లబ్ డిజి గందె ఈశ్వర్‌చరణ్ ఆధ్వర్యంలో నూతన వధువుకు రూ.30 వేల ఆర్థిక సహాయంతో పాటు పుస్తెమట్టెలు,పెళ్లి చీర, గాజులు,పసుపు,కుంకుమ అలయన్స్‌క్లబ్ ప్రతినిధి పెద్ది వైకుంఠం అందజేశారు. కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ ప్రతినిధులు సోమ శివకుమార్, ధనుంజయ, శ్రీకృష్ణ క్లబ్ అధ్యక్షులు జూలూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## రైతులను మోసగిస్తున్న మిల్లులపై చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సమాఖ్య నేతలు

**సదాశివపేట, అక్టోబరు 23(ప్రభాతవార్త):** రైతులను మోసగిస్తున్న జిన్నింగ్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని గురువారం తెలంగాణ మంజీర సమాఖ్య ఆధ్వర్యంలో డిప్యూటీ ఎమ్మార్వో అనుదీప్‌కు వినతిపత్రం అందజేశారు. సీసీఐ ద్వారా ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 8110 ధర నిర్ణయించడం జరిగింది కానీ రైతుల అవసరాన్నిబట్టి మంజిత్ జిన్నింగ్ మిల్ వారు క్వింటాల్‌కు రూ. 6500 కొనుగోలు చేసి రైతులను మోసగిస్తున్నారని పేర్కొన్నారు. తూకంలో మోసాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయని విలేకరులు మంజిత్ జిన్నింగ్ మిల్‌వారిని ప్రశ్నించగా వారిపై దురుసుగా మాట్లాడడం జరిగిందని, రైతులను మోసగిస్తున్న జిన్నింగ్ మిల్లులపై చర్యలు తీసుకొని రైతులను కాపాడాలని, రైతులకు గిట్టుబాటు ధరలు అదేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు విన్నవించడం జరిగింది. భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల మీద తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేయడం తగదని సమాఖ్య ద్వారా విన్నవిస్తున్నామన్నారు. రైతులపై మోసాలు ఆపకపోతే జిల్లా అధికారులను సంప్రదించవలసిన విన్నవించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మలపల్లి పృథ్వీరాజ్, పి.వెంకట్రావు, జలీల్, జ్ఞానోబా, రామ్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయం

### -పిఏసిఎస్ వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్

**ములుగు, అక్టోబరు 23 (ప్రభాతవార్త):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉపఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని పిఏసిఎస్ ములుగు మండల వైస్ చైర్మన్ కుక్కల నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం జూబ్లీహిల్స్ రహమత్‌నగర్‌లోని 160, 164 బూత్‌లలో బిఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేష్‌గౌడ్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ప్రజలకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. బిఆర్ఎస్ పట్ల ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందన్నారు. ఏ ఇంటికి వెళ్లి ఓటర్లను పలకరించినా కెసిఆర్ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తు చేశారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి పనులే జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీత గోపినాథ్ గెలుపుకు నాంది పలుకుతాయని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూత్‌ల ఇంచార్జ్‌లు గడ్డం శ్రీధర్, మాయలత, బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహమ్మద్ పాషా, ప్రకాష్, వెంకటేష్, శివకుమార్, సుధాకర్, శివశంకర్, బాలు, సత్యవతి, మధు, మురళి పాల్గొన్నారు.

## హార్వెస్టర్‌తో వరి కోత సమయంలో రైతులు జాగ్రత్తగా వ్యవహరించాలి

-మండల వ్యవసాయాధికారి స్వప్నజాదేవ్



పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి స్వప్నజాదేవ్

**కౌడిపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
అరుగాలం కష్టించి పండించిన పంటలను వరికోత సమయంలో తగిన సహాయంతో కోతకోసే సమయంలో తగుజాగ్రతలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి స్వప్నజాదేవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామంలోని వరిపంటలను రైతులతో క్షేత్రస్థాయిలో ఎంఎవో పరిశీలించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హార్వెస్టర్ నడిపేటప్పుడు ఆర్పిఎం 19-20 ఐయంటికి పైన ఉండేవిధంగా చూసుకోవాలని ఆమె తెలిపారు. అలాగే బి2 గేర్‌లో మాత్రమే హార్వెస్టర్ నడపాలని ఆమె సూచించడం జరిగింది. వరిలో కొయ్యకాళ్ళను తగల బెట్టకుండా భూమిలోనే కలియదున్నడం వల్ల అధికంగా ఒకరకమైన ఎరువులా ఉపయోగపడుతుందని ఆమె తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో ఈఎమెఓతోపాటు ఏఈవోలు సాహితీ, ప్రవంతి, నరేందర్, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

-ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజు



ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

**నారాయణఖేడ్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాలు వెంటనే విడుదలచేయాలని ఏబీవీపీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ రాజు డిమాండ్‌చేశారు. గురువారం నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ చౌరస్తా వద్ద అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యార్థి వ్యతిరేకవిధానాలు అవలంబిస్తోందని, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయకపోవడంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమవుతున్నారని విమర్శించారు. అలాగే ఆయన మాట్లాడుతూ కేవలం ఎన్నికల సమయంలోనే విద్యార్థులు గుర్తొస్తున్నారు. ద్వివర్ణ రాజకీయాలు ఆడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను మోసంచేస్తోంది. వెంటనే రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదలచేయాలని, లేనిపక్షంలో సీఎం, మంత్రులను ఎక్కడికక్కడ అడ్డుకుంటాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి శంకర్, విజయ్, రాకేష్, వికాస్, నవీన్, పండు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యాభివృద్ధికి స్కాలర్‌షిప్‌లు

-జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి



విద్యార్థులతో జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి

**నారాయణఖేడ్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
పట్టుదలతో చదివి ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ సాధన దిశగా విద్యార్థులు నిరంతరం ప్రయత్నం చేయాలని జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి అన్నారు. గురువారం జడ్పిహెచ్‌ఎస్ నారాయణఖేడ్ పాఠశాలలోని ఎనిమిదో తరగతి విద్యార్థులకు యూత్ ఫర్ సేవా వాలంటీర్ చంద్రశేఖర్ ఆచార్య ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యార్థులకు వివిధ స్కాలర్షిప్‌లు అందజేయడానికి అనేక పరీక్షలు ఉంటాయని అలాంటి పరీక్షలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ముందుకుసాగాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ పరీక్షద్వారా ఎంపికైన విద్యార్థులకు 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం స్కాలర్షిప్‌లు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ విశ్వనాథ్, హెచ్‌ఎంలు మన్మధకిషోర్, యాదవరెడ్డి, ఉపాధ్యాయులు యాదగిరి, రాజయ్య, రాజశేఖర్, చంద్రశేఖర్ ఆచార్య, ధన్‌సింగ్, చరణ్‌సింగ్, సత్తయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మానవసేవతోనే జీవితానికి పరమార్థం

-డాక్టర్ డి. ఓంప్రకాష్



డాక్టర్ ఓంప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నారాయణఖేడ్ అక్టోబరు 23, ప్రభాతవార్త:**
అన్నదానం, రక్తదానం నాసంకల్పం అని మానవ సేవతోనే జీవితానికి పరమార్థం లభిస్తుందని డాక్టర్ డి.ఓంప్రకాష్ గురువారం తెలిపారు. ఇటీవల గౌరవ డాక్టరేట్‌పట్టా అందుకున్న డి.ఓంప్రకాష్‌ని నారాయణఖేడ్ పట్టణంలో ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ డిగ్గే బాబు సన్మానించారు. కార్యక్రమంలో స్టేట్‌సెక్రటరీ ఆనంద్, ఖైసార్, సురేష్‌గౌడ్, పండరి, రాహుల్, నవీన్, రాకేష్, హఫీజ్ పాల్గొన్నారు.

## రెండులక్షల విలువగల ఎల్‌ఓసి అందజేత

-మండల అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు

**గుమ్మడిదల, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మున్సిపాలిటీకి చెందిన వడ్డే మల్లేష్‌కు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు చేతులమీదుగా గురువారం మండల కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో రెండులక్షల విలువగల ఎల్‌ఓసిని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మపాల్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



బేగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**రాయపోల్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రాయపోల్ మండలపరిధిలోని బేగంపేట గ్రామంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం వడ్డేపల్లి నుండి నాచారం వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బేగంపేట గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అకాల వర్షాల వల్ల రోడ్లు దెబ్బతిన్నాయని, పంచాయతీరాజ్, రోడ్డు భవనాలశాఖ మంత్రులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాను ఎంపిగా ఉన్నప్పుడు రోడ్ల అభివృద్ధి కోసం నిధులు మంజూరుచేసినా, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దుచేసిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రస్తుతం ప్రభుత్వం హామ్‌పథకం ద్వారా రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో దుబ్బాక నియోజకవర్గ రోడ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు. హామ్ పథకంలో మంజూరైనరోడ్లకు ఇప్పటివరకు టెండర్ ప్రక్రియ ప్రారంభం కాలేదని, వారం రోజుల్లో ఎన్ని రోడ్లు మంజూరు చేసారో వివరాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి సచివాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రోడ్ల అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేకుండా ప్రజలపక్షాన అన్ని పార్టీలు కలిసి ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటేశ్వరశర్మ, మాజీ జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గుప్తా, మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు పర్వేజ్, బేగంపేట మాజీ సర్పంచ్ మద్ద ప్రవీణ్, మాజీ ఎంపిటిసి వెంకటయ్య, సీనియర్ నాయకులు రణం శ్రీనివాస్‌గౌడ్, రేకుల నరసింహారెడ్డి, ఇప్ప దయాకర్, ఉప్పరి స్వామి, కుమార్, యాదగిరి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## బొడ్మట్‌పల్లిలో చౌరస్తాలో నీటి ఎద్దడి..

-అంగడి ప్రజలకు రెండునెలలుగా అందని తాగునీరు



బొడ్మట్‌పల్లి చౌరస్తాలో వృథాగా పడి ఉన్న వాటర్ ట్యాంక్

**టేక్మాల్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి గ్రామ చౌరస్తాలో మోటర్ మరమ్మతుకు నోచుకోక గత రెండునెలలుగా వారవారం జరిగే సంత ప్రజలకు నీటి తిప్పలు తప్పడంలేదు. మంగళవారం వారాంతపు సంతతోపాటు ప్రతినిత్యం వచ్చీ, పోయే ప్రజలకు నీటిసౌకర్యం లేక తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా పట్టంచుకోవడంలేదని అంటున్నారు. అంగడికి ఆదాయంవస్తున్నా వచ్చీ, పోయే జనాలకు మంచినీటిని అందించడంలో శ్రద్ధ చూపడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా ప్రత్యేకశ్రద్ధవహించి మోటార్ మరమ్మతులను చేయించి నీటి సమస్యను తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.
అనే ఫైల్ నేమ్‌తో పంపుతున్నాం

## టేక్మాల్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



గొల్లగుడెంలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న దృశ్యం

**టేక్మాల్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
టేక్మాల్లోని గొల్లగుడెంలో ఐకెపి ఆధ్వర్యంలో గురువారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతులు దళారులనునమ్మి మోసపోవద్దని వారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకు రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాంప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు నిమ్మ రమేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, ఆయా పార్టీల నాయకులు పాపయ్య, భాస్కర్, సిద్దయ్య, షేక్ మజహర్, సిద్దిరాములు, గోవిందచారి, అశోక్, రవి, రెడ్యానాయక్, ఆంజనేయులు, సాయిబాబాలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై వ్యవసాయ పరికరాలు

-28వరకు దరఖాస్తుల స్వీకరణ

**సిర్గాపూర్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
రాయితీపై వ్యవసాయ పరికరాలను అందుకునేందుకు అన్నదాతల ఈ నెల 28వ తారీఖు వరకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ తెలిపారు. 2025 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ, ఎస్టీ, మహిళారైతులకు 50శాతం సబ్సిడీ, ఇతర రైతులకు 40శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు అందుకోవచ్చన్నారు. రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పంపుల రొటవేటర్లు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్లులు, డిస్క్ హ్యారో, కల్టివేటర్లు, ఎంబి ప్లోష్, కేజీ వీల్స్, పవర్ వీడర్లు, బ్రష్ కటర్లు, పవర్ టిల్లర్లు, మొక్కజొన్న షెల్లెర్లు, స్ట్రాబేలర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తమ దరఖాస్తు పత్రాలతో పాటు ఆధార్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, ట్రాక్టర్ సంబంధించిన పరికరాలకు ఆర్‌సి జిరాక్స్, బ్యాంక్ పాస్‌పుస్తకం, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, సాయిల్ హెల్త్‌కార్డులను జతచేయాలన్నారు. దరఖాస్తుపత్రాలను వ్యవసాయక్లస్టర్ అధికారులకు లేదా మండలవ్యవసాయ అధికారికి అందచేయాలన్నారు.

## సదర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



రామచంద్రాపురంలో సదర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**రామచంద్రాపురం, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్‌పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ సండే మార్కెట్‌లో రామచంద్రాపురం యాదవసంఘం సదర్ ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సదర్‌ఉత్సవాల్లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్‌లు పాల్గొని యాదవులకు ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దున్నపోతులను యాదవులు అందంగా ముస్తాబుచేసి దున్నపోతులతో విన్యాసాలు చేయించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను యాదవసంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.

## అదనపు బస్సులు కేటాయించండి..

-బొల్లారం విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న విద్యార్థుల దృశ్యం

**పటాన్‌చెరు, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
అదనపు బస్సులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ బొల్లారం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. జిన్నారం మండలం బొల్లారం మున్సిపల్ పరిధిలో విద్యార్థులకు సరైన సంఖ్యలో బస్సులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం విద్యార్థులు మున్సిపాలిటీలోని ప్రధాన కూడలిలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన సంఖ్యలో బస్సులు లేకపోవడం ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. బొల్లారం నుండి మియాపూర్ వరకు అధిక బస్ సర్వీసులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ అధికారులు విద్యార్థులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతామని ఆందోళనను విరివింపజేశారు.

## ఆరోగ్యానికి ఆహారం కీలకం

-గీతంలో ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం



ప్రపంచ ఆహార దినోత్సవంలో గీతం విద్యార్థులు

**పటాన్‌చెరు, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
ఆరోగ్యం, స్థిరత్వం, ప్రపంచ సామరస్యాన్ని ప్రోత్సహించడంలో ఆహారం కీలకపాత్ర గురించి అవగాహనపెంచే లక్ష్యంతో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ ఆహారదినోత్సవం 2025ను నిర్వహించారు. ఈ వేడుకల ప్రారంభోత్సవంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డివివిఎస్‌ఆర్‌వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతాహర్ రెజా, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు. విజేతలకు ఉత్తేజకరమైన బహుమతులతోపాటు ఇందులో పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. పలువురు విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు ఈ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల విక్రయాలను వేగవంతం చేయండి

-డిఎస్‌ఓ నిత్యానందంగౌడ్



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, వడ్లలో తేమశాతం పరిశీలిస్తున్న డిఎస్ఓ నిత్యానందంగౌడు

**కౌడిపల్లి, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
వరి కొనుగోలుకేంద్రాల ఇంచార్జిలు వడ్ల విక్రయాలను మరింత వేగవంతం చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానందంగౌడ్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని దేవులపల్లి గ్రామంలో మహమ్మద్‌నగర్ సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి వడ్లలోగల తేమ శాతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవులపల్లి గ్రామం నుండి కొనుగోలు చేసిన ధాన్యంలో ఒకలారీ ధాన్యం బస్తాలను ట్యాగ్ చేసిన రైస్ మిల్లుకు రవాణా చేసినట్లు ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద అనుకున్నంత మేర హమాలీలను ఏర్పాటు చేయడం జరిగిందని, తూకంలో ఎలాంటి జాప్యం జరగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు ఆయన రైతులకు తెలియపరిచారు. రైతులకు అన్నివిధాలుగా సంతోషదాయకంగా ఉండేటట్లు కేంద్రాలవద్ద ఏర్పాట్లు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. రైతులు ఆరుగాలం పడించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల నుండి వరి విక్రయం జరిపేలా ప్రభుత్వం చొరవ చూపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఈయనతోపాటు మహమ్మద్‌నగర్ సొసైటీ సిఈవో దుర్గయ్యగౌడ్, మాసుల నర్సింలు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఇబ్రహింపూర్‌లో ఉపాధిహామీ పనులపై సమావేశం

**న్యాల్‌కల్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులపై మండలపరిధిలోని ఇబ్రహింపూర్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ ఎపిఓ రంగారావు మాట్లాడుతూ గ్రామంలో వ్యక్తిగత గోట్‌సైడ్ పొలిటిషర్స్, పండ్లతోటలపెంపకం పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా పనులు అవసరమున్నవారు తమపేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఈఓ ఈనా రాథోడ్, పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## తెల్లాపూర్ మున్సిపాలిటీలో శ్రమదానం



తెల్లాపూర్ మున్సిపాలిటీలో శ్రమదానం చేస్తున్న దృశ్యం

**రామచంద్రాపురం, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
తెల్లాపూర్ మున్సిపాలిటీలో గురువారం సీనియర్ సిటిజన్స్‌లతో కలిసి శ్రమదానం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మున్సిపల్‌పరిధిలోని మేఫర్‌రోడ్డులో శ్రమదానంచేసి పరిసరాలను పరిశుభ్రం చేశామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు పోరాటాలు

-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్



సిఐటియు నాయకుల దృశ్యం

**పటాన్‌చెరు, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సిఐటియు ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని, కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్‌కోడ్స్ కార్మికులకు ఉరితాళ్లుగా మారుతున్నాయని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ఆరోపించారు. గురువారం పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్‌లో జరిగిన సిఐటియు కార్యకర్తల సమావేశంలో మానిక్ మాట్లాడుతూ... కార్మిక పోరాటాల సారథి సిఐటియు సంగారెడ్డిజిల్లా నాలుగో మహాసభలు అక్టోబరు 19న సదాశివపేట పట్టణంలో విజయవంతంగా జరిగాయి. ఈ మహాసభల్లో జిల్లాలో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రణాళికను రూపొందించుకోవడం జరిగిందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో 14తీర్మానాలు చేసామని తెలిపారు. ఈమహాసభలో 58 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నికలో 17మందితో జిల్లా ఆఫీస్ బేరర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం నుండి సిఐటియు నూతన జిల్లా కమిటీ సభ్యులుగా శాంతకుమార్, సుధాకర్, రాజులు ఎన్నికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పాశమైలారం పారిశ్రామిక క్లస్టర్ నాయకులు రాజు, సుధాకర్, వెంకటేష్, మహేశ్వర్‌రెడ్డి, చంద్రయ్య, శ్రీనివాస్, రోషన్, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడి మృతికి కారణమైన యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

-మంగళ్‌ట్యాబ్ కంపెనీ ముందు సిఐటియు ధర్నా



మంగళ్‌ట్యాబ్ కంపెనీ ముందు ధర్నా చేస్తున్న సిఐటియు

**జహీరాబాద్, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బూచినెల్లి గ్రామ శివారులోని మంగళాట్యాబ్ పరిశ్రమలో కార్మికుడి మృతికి కారణకులైన పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కంపెనీ ముందు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి, జహీరాబాద్ ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ ఎస్. మహిపాల్ మాట్లాడుతూ కంపెనీలో భద్రతాప్రమాణాలు పాటించకపోవడంవల్లనే ప్రమాదం చోటు చేసుకుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కర్మాగారం ముందు ఆందోళన చేస్తుండటంతో యాజమాన్యం దిగివచ్చి కార్మికుడి కుటుంబానికి పరిహారం అందించేందుకు సమ్మతి ప్రకటించింది. కార్మికుడి కుటుంబంలో ఒకరికి పర్మనెంట్ ఉద్యోగం, రూ.5లక్షల నష్టపరిహారం, రూ.2లక్షలు అంత్యక్రియలకు అందచేయడం, రూ.2లక్షలు శవం తీసుకుపోయేందుకు ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు అందజేసేందుకు సమ్మతించినట్లు మహిపాల్ పేర్కొన్నారు. కర్మాగారంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని యాజమన్యానికి సూచించామన్నారు. కార్యక్రమంలో ఆయా పరిశ్రమల సిఐటియు యూనియన్‌ల ప్రధాన కార్యదర్శులు నరేష్, మహేశ్వర్, సందీప్‌రెడ్డి, రవి, నాయకులు బాల్‌రాజ్, నజీర్, శ్రీకాంత్, వాహబుద్దీన్, భార్గవ్, బి.రాజ్‌కుమార్, ఉమా, ముతబీర్, పులెందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు విధులపై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణగౌడ్

**చిన్నశంకరంపేట, అక్టోబరు 23, ప్రభాతవార్త:**
పోలీసు విధులపై, విధుల్లో వినియోగించే ఆయుధాలపట్ల విద్యార్థి దశనుంచే అవగాహనకలిగి ఉండాలని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పోలీసులు నిర్వర్తించే విధులపై విద్యార్థులకు గురువారం ఎస్ఐ నారాయణగౌడ్ అవగాహన కల్పించారు. పోలీసులు విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, రక్షణ, చట్టాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్య వచ్చిన ధైర్యంగా ఎదుర్కోవాలని, అత్యవసర సమయంలో 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.